నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 14 మార్చి 2024 | SURYAPET

రెడ్లకుంటలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే పద్మావతి

చివరి భూములకు నీరందించడమే సర్కారు లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ రూరల్, మార్చి 13 : ఆర్కే మేజర్, పాలేరు పరిధిలోని చివరి భూములకు నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రెడ్లకుంటలో రూ.47.54 కోట్లు, అనంతగిరి మండలం శాంతినగర్‌లో రూ.5.30 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ రెండు లిఫ్ట్‌లతో రెడ్లకుంట, నల్లబండగూడెం, కాపుగల్లు, శాంతినగర్, గోండ్రియాల, బొజ్జగూడెంతండా, మొగల్లాయికోట, అన్నారం, లక్కవరం, తమ్మరబండపాలెం, చిమిర్యాల, కొత్తగూడెం, నల్లబండగూడెం గ్రామాల రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం గ్రామస్తులు వారిని భారీ పూలమాలతో సన్మానించారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీపీ మల్లెల రాణి, జడ్పీటీసీ మందలపు క్రిష్ణకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, అప్పారావు, నారాయణరావు, లక్ష్మణ్‌రావు, వరప్రసాద్‌రెడ్డి, రామారావు, ఇరిగేషన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నల్లగొండ మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పక్కన కలెక్టర్ హరిచందన, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- విద్యుత్ సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష

నీలగిరి, మార్చి 13 : ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా మరో 3 నెలల పాటు మున్సిపల్, మిషన్ భగీరథ, విద్యుత్ అధికారులు, కౌన్సిలర్లు బాధ్యతగా పని చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. నల్లగొండ మున్సిపాలిటీలో బుధవారం జిల్లా కలెక్టర్ హరిచందనతో కలిసి పట్టణంలో తాగునీరు, విద్యుత్ సరఫరాపై కౌన్సిలర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు లేక ఈ సంవత్సరం బోర్లన్నీ ఎండిపోయాయని, అందుబాటులో ఉన్న నీటిని మరో మూడు నెలలపాటు జాగ్రత్తగా వాడుకోవాలని అన్నారు. 25 సంవత్సరాల్లో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదని తెలిపారు. మున్సిపల్ అధికారులు తాగునీటితోపాటు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీటి సరఫరా విషయంలో నిధులకు ఇబ్బంది లేదని, ఎన్ని ట్యాంకర్లు కావాలన్నా తెప్పిస్తామని పేర్కొన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కొన్ని వార్డుల్లో తాగునీటికి ఇబ్బందిగా ఉన్నదని, పట్టణంలో రోజు మార్చి రోజు 20-30 నిమిషాలే తాగునీరు వస్తున్నదని పలువురు కౌన్సిలర్లు తెలిపారు. కొన్నిచోట్ల లీకేజీలు అవుతున్నాయని, వాటిని అరికట్టాలని కోరారు. కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ అవసరమైతే అదనపు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ప్రత్యేకించి తాగు నీటిని వృథా చేయవద్దని, తోటలు, గార్డెన్‌కు, ఇల్లు శుభ్రం చేసుకునేందుకు, ఇతర పనులకు తాగునీటిని వాడవద్దని సూచించారు. అంతకుముందు మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు జిల్లాలో ప్రస్తుతం తాగునీటి సరఫరాపై వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్ఓ రాజ్యలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, ఆర్డీఓ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పానగల్‌లో నీటి శుద్ధి కేంద్రం పరిశీలన

పానగల్‌లోని 19.6 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాన్ని మంత్రి కోమటిరెడ్డి సందర్శించారు. వాటర్ ట్రీట్‌మెంట్ పనులు, తాగునీటి సరఫరా, పానగల్ నీటి శుద్ధి కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి కెపాసిటీ గురించి మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ప్రజారోగ్య శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నదని, ఉన్న నీటితో ప్రజలందరికీ సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జి.యడవల్లి, తేలకంటిగూడెం నీటి శుద్ధి కేంద్రాలను పునరుద్ధరించి వాటి ద్వారా గ్రామాలతో పాటు, చండూరు మున్సిపాలిటీకి మంచినీటిని సరఫరా చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర తాగునీటి సరఫరా ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సూచించారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రూ.55 కోట్ల టీఎఫ్ఐడీసీ నిధులతో విలీన గ్రామాల్లో నిర్మించనున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు నల్లగొండ బైపాస్ రోడ్డులో, ఎన్జీ కాలేజీ వద్ద కోటి రూపాయలతో నిర్మించనున్న హెల్త్ అండ్ హైజిన్ స్ట్రీట్ ఫుడ్ కోర్టు పనులకు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.600 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు పనులకు వచ్చే నెలలో టెండర్లు పిలువనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు తాగు నీటితోపాటు వినియోగించుకునే నీటికి ఇబ్బంది లేకుండా 10లక్షలు, 15 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 2 వాటర్ ట్యాంక్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. పనుల నాణ్యతలో రాజీ పడొద్దని ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు.

మనసుంటే ఎండిపోయే పంటలకు జీవం

జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా పట్టింపేది?
2015లో సాగర్ నుంచి 508 అడుగుల్లోనే నీటి విడుదల..
ప్రస్తుతం 515 అడుగుల్లో జలాలు
కనీసం ఒక్క తడికి నీటిని విడుదల చేయాలంటున్న రైతాంగం

సాగర్ డ్యామ్ (ఫైల్)

సూర్యాపేట, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న పంటలను కాపాడడానికి మనసు పెట్టి ఆలోచిస్తే మార్గం లభిస్తుంది. బీఆర్ఎస్ సర్కారులో ఉమ్మడి జిల్లాకు ఒక్క మంత్రి మాత్రమే ఉండి నీటిని విడుదల చేయించి పంటలను కాపాడగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇద్దరు మంత్రులు ఉన్నా కాదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. 2015 యాసంగిలో నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 508 అడుగుల నీటి మట్టం ఉన్నా ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు నాటి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నీటిని విడుదల చేయించారు. ప్రస్తుతం సాగర్‌లో 515 అడుగుల వరకు జలాలు ఉన్నందున జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వంతో చర్చించి కనీసం ఒక్క తడికైనా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం.. నిర్వహణ లోపం

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతోపాటు రాజకీయ లబ్ధి కోసం చాలా ఏండ్ల తర్వాత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యాసంగిలో కరువుచాయలు అలుముకుంటున్నాయి. మేడిగడ్డ బ్యారేజీ వద్ద జరిగిన చిన్నపాటి కుంగుపాటును రాజకీయంగా వినియోగించుకుంటూ నీటిని విడుదల చేయకుండా కాళేశ్వరం ఆయకట్టు రైతుల పంటలను ఎండబెడుతున్నది. మరో పక్క నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండడంతో ఆయకట్టు పరిధిలో వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోతున్నది. పంటలను కాపాడుకోవడానికి రైతులు వరి పొలాలకు ట్యాంకర్లతో నీటిని పోస్తున్నారు. కొత్తగా బోర్లు వేస్తున్నారు. ఇప్పటికే చాలాచోట్ల పంటలు ఎండిపోవడంతో చేసేదేమీలేక పశువుల మేతకు వదిలేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పంట పొట్టకు వచ్చిన దశలో ఉన్నది. కనీసం ఒక్క తడికైనా సాగర్ నీటిని విడుదల చేయాలని, చెరువులు, కుంటలు నింపితే యాసంగి పంట చేతికి రావడంతోపాటు తాగునీటి ఇబ్బందులు కూడా తలెత్తకుండా ఉంటాయని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

శేష వాహనంపై లక్ష్మీనరసింహుడు

వైభవంగా యాదగిరి గుట్ట బ్రహ్మోత్సవాలు

ఉదయం మత్స్యావతారంలో దర్శనమిచ్చిన స్వామివారు



శేషవాహనంపై స్వామివారు

యాదగిరిగుట్ట, మార్చి13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. 3వ రోజు బుధవారం ఉదయం 9 గంటలకు స్వామి వారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శేష వాహన సేవలో తిరుమాఢ వీధుల్లో ఊరేగారు. సాయంత్రం 7 గంటలకు నిత్యహోమం, చతుస్థానార్చనలు నిర్వహించారు. వైకుంఠంలో స్వామివారికి నిరంతరం సేవా కైంకర్యాలు చేసిన వ్యక్తి అనంతుడు. ఆయనే ఆదిశేషు. అలాంటి ఆదిశేషుడిలో ప్రవాసుదేవుడిలా స్వామివారిని అలంకరించి ఆస్థానం చేశారు. వేదాలు, పురాణాలతో ప్రార్థించారు. భక్తజన బాంధవుడు లక్ష్మీనారసింహుడు ప్రీతిపాత్రమైన శేష వాహనుడిపై తిరు మాఢ వీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవ శుభరాత్రుల్లో యాదగిరి గుట్ట కొండపై జ్వాలాకృతిలో, సర్పాకారంలో వెలసిన స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆదిశేష వాహనాన్ని భక్తులు కనులారా దర్శించుకున్నారు.



ఆలయ మాఢ వీధుల్లో మత్స్యావతారంలో స్వామి వారి సేవ

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం లక్ష్మీనరసింహ స్వామి వటపత్రశాయి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి హంస వాహనంపై స్వామి వారి సేవ నిర్వహించనున్నారు.

శేష వాహనరూఢుడై..

బ్రహ్మోత్సవాల్లో ప్రప్రథమంగా శేష వాహనరూఢుడై భగవానుడు భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామి వారి శేష వాహనాన్ని పశ్చిమ రాజగోపురం గుండా ఉత్తరం, తూర్పు, దక్షిణ మాఢ వీధుల్లో ఊరేగించారు. తూర్పు రాజగోపురం ముందు ప్రత్యేక మండపంలో వేంచేపు మండపంలో అధిష్టింప జేసి సేవించారు. శ్రీహరి పాద పద్మములను సమస్కరించేటప్పుడు పాదపీఠంగా ఉన్న ఆదిశేషుడికి సర్వ దేవతాధిపతియైన మహావిష్ణువు ప్రథమ నమస్కార అర్హతను అప్రయత్నంగా అనుగ్రహించడం ఆదిశేషువుపై పరమాత్మకు గల అవ్యాజ్యమైన కృపగా భక్తులు భావిస్తూ శేషవాహనరూఢుడైన అలంకార సేవలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్య నిర్వహణాధికారి రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు, యజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి రఘు, గట్టు శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభిషేకోత్సవం.. అలంకారోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యపూజ కైంకర్యాల అనంతరం స్వామివారికి మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలు యజ్ఞాచార్యులు , పారాయణందారులు, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకోత్సవం జరిపించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకారంలోని కల్యాణ మండపంలో స్వామివారిని మత్స్యావతారంలో అలంకరించి పశ్చిమ రాజగోపురం గుండా ఉత్తరం, తూర్పు, దక్షిణ మాఢ వీధుల్లో ఊరేగించారు. నాలుగు వేదాలు, పురానాలు, ఉపనిషత్‌లు, దివ్యప్రబంధ పాశుర పఠణాలు కనులపండువగా చేపట్టారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం మహావిష్ణువు అవతార రూపాల్లో స్వామివారిని ఉత్సవాల్లో అలంకరించి సేవించడం అలంకార ఉత్సవాల ప్రత్యేకత అని ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు మత్స్యావతార విశిష్టతను భక్తులకు వివరించారు.

2 గంటలు ఆలస్యం.. ఎండలో భక్తుల ఇబ్బంది

ఉదయం 9 గంటలకు జరుగాల్సిన మత్స్యావతార సేవ ఊరేగింపు 11 గంటలకు నిర్వహించారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి తూర్పు రాజగోపురం ముందు సేవను అధిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మొదటగా పశ్చిమ రాజగోపురం ఎదురుగా ప్రత్యేకంగా సిద్ధం చేసిన వేంచేపు మండపంలో సేవను అధిష్ఠించాల్సి ఉంది. కానీ ఉదయం తూర్పు రాజగోపురం వద్దకు కార్యక్రమం మారింది. ఎండవేడి తట్టుకునేందుకు చలువ పందిళ్లు, టెంట్లు లేకపోవడంతో తూర్పు రాజగోపురం ముందు సేవ ప్రాంగణంలో భక్తులు ఇబ్బంది పడ్డారు. అలంకార సేవ అధిష్ఠించే సేవ ప్రాంగణం మారడంతో వసతుల ఏర్పాటులో జాప్యం జరిగిందని, నేటి నుంచి అలా జరుగకుండా చూస్తామని దేవస్థాన ఈఓ రఘు తెలిపారు.

స్వామివారి అలంకార సేవ సందర్భంగా చలువ పందిరి లేక ఎండలో ఇబ్బంది పడుతున్న భక్తులు

సూర్యాపేట ఎస్‌బీఐలో అక్రమాలు!

- రూ.5కోట్లు స్వాహా చేసిన అప్పటి మేనేజర్
- ఆలస్యంగా వెలుగులోకి..

సూర్యాపేట సిటీ, మార్చి 13 : జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై గల ఎస్‌బీఐలో గతంలో ఇక్కడ పనిచేసిన మేనేజర్, సిబ్బంది వ్యక్తిగత రుణాల పేరిట సుమారు రూ.5కోట్లు స్వాహా చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంకు ఆస్తులను రక్షిస్తూ వినియోగదారులకు సేవలు అందించాల్సిన బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నవారు కోట్ల రూపాయల బ్యాంకు సొమ్మును కాజేయడం పట్ల పోలీసులు విచారణ చేపడుతున్నారు. ప్రస్తుతం రామంతాపూర్ బ్రాంచి మేనేజర్‌గా వ్యవహరిస్తున్న ఆయన.. అక్కడి బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా సుమారు రూ.3కోట్లు కాజేసినట్లు తేలింది. దాంతో గతంలో సూర్యాపేట ఎస్‌బీఐలో మేనేజర్‌గా పని చేసిన కాలంలో మంజూరు చేయబడిన రుణాలపైనా విచారణ చేపట్టగా.. ఇక్కడి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వంద మందికి పైగా వ్యక్తిగత రుణాలు మంజూరు చేసినట్లు చూపి డబ్బును కాజేశారు. ఈ విషయం బ్యాంకింగ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సదరు మేనేజర్, మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మంచినీళ్లు మహాప్రభో..!

- కొండమల్లేపల్లిలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కొండమల్లేపల్లి, మార్చి 13 : పట్టణంలోని బీసీ కాలనీలో ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉన్నా 20 రోజుల నుంచి మంచినీళ్లు రావడం లేదు. దాంతో కాలనీ మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ 20 రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిత్యం 20రూపాయలు పెట్టి మంచి నీళ్లు కొనుక్కుంటున్నామని తెలిపారు. కాలనీలో ఉన్న బోరు మోటార్ కొద్ది నెలల క్రితమే చెడిపోయిందని, రిపేర్ చేయాలని గ్రామపంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ అధికారులు స్పందించి కాలనీకి మంచినీళ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, బోర్ మోటర్‌కు మరమ్మతులు చేయాలని కోరారు.

కొండమల్లేపల్లి పట్టణంలోని బీసీ కాలనీలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బెట్టెతండాలో మూసీపై లిఫ్ట్

- రూ.33.83 కోట్లు మంజూరు
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రులు

పాలకవీడు, మార్చి 13 : మండలంలోని బెట్టెతండా గ్రామ పంచాయతీ పరిధి మూసీ నది పరీవాహక ప్రాంతం లో నిర్మించ తలపెట్టిన లిఫ్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.33.83 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులకు రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. బెట్టెతండా, పాడ్యతండా, సజ్జాపురం, కోమటికుంట గ్రామాలకు తాగు, సాగునీరు అందించనున్న ఈ లిఫ్ట్ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు జరిగాయి. అప్పట్లో అనుమతి లభించినా ఎన్నికల సమయం దగ్గర పడడంతో నిధులు మంజూరు కాలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి కావడంతో ఈ లిఫ్ట్‌కు తిరిగి మోక్షం లభించింది. ఈ లిఫ్ట్ నిర్మాణానికి రూ.26 కోట్ల వ్యయం అవుతుందని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా, ప్రస్తుత ప్రభుత్వం అంచనా వ్యయం రూ.33 కోట్లుగా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు నిధులు మంజూరు చేసింది. ఈ లిఫ్ట్ పూర్తయితే బెట్టెతండా, పాడ్యతండా, సజ్జాపురం, కోమటికుంట గ్రామాల్లో 2,041 ఎకరాలకు సాగు నీరు అందుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

సభా స్థలం పరిశీలన

బెట్టెతండాలో ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ ప్రతిపాదిత ప్రాంతం, అనంతరం నిర్వహించే సభాస్థలాన్ని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ శంకుస్థాపనకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి గురువారం రానున్నారని తెలిపారు. అనంతరం గ్రామ శివారులో రైతులతో సభ నిర్వహిస్తారన్నారు. ఆయన వెంట ఎంపీపీ గోపాల్, తాసీల్దార్ శ్రీదేవి, బెట్టెతండా మాజీ సర్పంచ్ మాలోతు మోతీలాల్, నాయకులు ఉన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

రామగిరి/సూర్యాపేట అర్బన్, మార్చి 13 : 15 రోజులుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ముగిశాయి. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ సామగ్రితో ఇంటిబాట పట్టారు. గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తి కానున్నాయి. ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 16 వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఈ నెల 16నుంచి మూల్యాంకనం ప్రారంభమవుతుందని నల్లగొండ డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు. సూర్యాపేట జిల్లాలో బుధవారం జరిగిన ఫస్టియర్ పరీక్షలో 8,627 మంది విద్యార్థులకు 8,074 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సీఎం కుర్చీ కోసమే రేవంత్‌రెడ్డి ఆర్భాటం

- ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలం
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

నూతనకల్, మార్చి 13 : రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీ కోసమే ఆర్భాటాలు తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ విమర్శించారు. నూతనకల్ మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి అని మర్చి పోయాడన్నారు. ఉమ్మడి నల్లగొండ రైతులు ఆగమైతున్నారని, సాగు నీరు అందించి పంటలను కాపాడాలని కోరారు. సాగర్ కాల్వ కింద 3.5 లక్షల ఎకరాలు నీళ్లు లేక ఎండి పోతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన ఉద్యోగ నియామకాలకు కాగితాలు ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మరని తెలిపారు. కేసీఆర్ సర్కారు హయాంలో జరిగిన పనులకే కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నదని మండిపడ్డారు. చేతకాని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకీ అప్పగించారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరువు, కాటకాలు పునరావృతం అవుతున్నాయని విమర్శించారు. రైతులకు కరెంట్ సరిగ్గా ఇవ్వక రాత్రి పొలం దగ్గరికి వెళ్లిన చిన్ననెమిల గ్రామానికి చెందిన రైతు రావుల లింగయ్య పాము కాటుతో మరణించారని, దీనికి కారణం ఎవరు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు, కరెంట్ రంగాలపై ప్రభుత్వం సమీక్ష సమావేశం నిర్వహించాలని, ఎండిపోతున్న పంటలను పరిశీలించి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. నీళ్లు అందకపోతే తుంగతుర్తి ఎడారి ప్రాంతం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పక్క పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి, సోనియాగాంధీ వద్దకే పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బతుకు మొత్తం బ్లాక్ మెయిలింగ్ అని, ఆయన మాటలను ప్రజలు పట్టించుకోరని చెప్పారు.

ఈ సమావేశంలో జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ రజాక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, చూడి లింగారెడ్డి, బత్తుల విద్యాసాగర్, బత్తుల విజయ్‌కుమార్, సాయిల్‌గౌడ్, లింగరాజు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.